క్లుప్తంగా

గాజుల తల్లి.. శ్రీ పైడితల్లి


గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారిని పుష్పాలు, గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను చెల్లించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కెఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉన్నత విద్యకు ఇంటర్ కీలకం


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఉన్నత విద్యలో రాణించాలంటే ఇంటర్ కోర్సుల్లో ప్రతిభ చూపడం కీలకమని ప్రముఖ సైకాలజిస్ట్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మహరాజా అటానమీ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్చి నెలలో జరగబోయే పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధమవ్వాలో అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా చదవాలని ర్యాంకులను కొలమానంగా కాకుండా సబ్జెక్ట్ చేర్చుకునే విధంగా తరగతులకు హాజరవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కన్వీనర్లు పీఎస్ఎస్‌రావు, డి.సన్యాసిరావు, ఎస్.నవీన్ కుమార్, విభాగాధిపతి వి.బాజ్జీ, అధ్యాపకులు డాక్టర్ ఎ.గంగరాజు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్తులు చేతిలో కొండచిలువ హతం


గ్రామస్తులు చేతిలో హతమైన కొండ చిలువ

పూసపాటిరేగ: చల్లవానితోట పంచాయతీ మొలకాం సమీపంలో మంగళవారం ఉదయం కాశోడు కల్లాలు వద్ద పశువులు పాకలోకి సుమారు 10 అడుగులు కొండచిలువ చొరబడింది. దీనిని గమనించిన రైతులు కొండచిలువను హతమార్చారు. పాకలో పశువులు వుండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

కొత్త ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలి

- డీఆర్‌డీఓ సౌత్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ బిశ్వజిత్ చౌబే


లెండి ఇంజినీరింగ్ కళాశాలలో లాంగ్వేజ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజినీర్ బిశ్వజిత్ చౌబే

డెంకాడ: విద్యార్థులను కొత్త ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే విధంగా ప్రోత్సహించాలని డిఫెన్స్ రీసెర్చ్ డెవలెప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ) సౌత్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ డాక్టర్ బిశ్వజిత్ చౌబే అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త లాంగ్వేజ్ ల్యాబ్‌ను, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతుల్లో భాగంగా యూత్ టు లీడ్ అండ్ మిషన్ 45 డేస్ అనే అంశంపై ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిశ్వజిత్ చౌబే ప్రసంగించారు. మారుతున్న కాలం, అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు కావాల్సి ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్ నాయకులని వివరించారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే నిత్య నూతన ఆలోచనలు, వాటి అమలు, సమర్ధవంతమైన నాయకత్వం, ప్రణాళిక వంటివి చాలా కీలకమని వివరించారు. దేశ రక్షణ రంగంలో ఆధునాతన ఆయుధ వ్యవస్థలపై వివరించారు. అతిథి బిశ్వజిత్ చౌబేను సత్కరించారు. కార్యక్రజుమంలో కళాశాల చైర్మన్ పెద్దిరెడ్డి మధుసూదనరావు, సెక్రెటరీ, కరస్పాండెంట్ కోడూరు శివరామకృష్ణ, పాలక మండలి సభ్యుడు పెద్దిరెడ్డి రాజీవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక ఆసరా


పూసపాటిరేగ: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఎంపీడీఓ రాధిక తదితరులు


డెంకాడ: వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలన్న సంకల్పంతో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా చివరి విడత నిధులను మంజూరు చేశారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ప్రారంభోత్సవ కార్యక్రమం లైవ్‌లో పొదుపు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు మంగళవారం తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు నాలుగ విడతలుగా రుణాల మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. వీటిని మహిళలు వారి ఆర్థిక ఎదుగుదలకు వినియోగించుకున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యతను ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు విజినిగిరి అచ్చింనాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ చిక్కాల జనార్ధనరావు, ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాధిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో విడత ఆసరా కార్యక్రమానికి సంబంధించి మహిళల ఖాతాలోకి నగదు జమ అవుతోందన్నారు. మండల పరిధిలో 1575 సంఘాలుకు రూ.12.33 కోట్లు నగదు జమ అవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్ధనరావు, టొంపల సీతారాం, వెలుగు ఏపీఎం పెంటం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడే ఆసరా...

పూసపాటిరేగ ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం బుధవారం జరగనున్నట్టు ఎంపీడీఓ ఎం.రాధిక తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసురావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరవుతారని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాలు మహిళలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మహిళలను ఆర్థికంగా ఆదుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా ఆదుకున్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగు విడతలు కలిపి రూ.39వేల 200 మంజూరు చేశారు. వైఎస్సార్ చేయూత పథకంలో మూడు విడతలు కలుపుకుని రూ.56వేల 250 అందించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.3వేల 600 అందించారు. రైతు భరోసా, అమ్మ ఒడి ద్వారా ప్రతీ ఏటా తన బ్యాంకు ఖాతాలోకి డబ్బులను జమ చేసి తమను ఆర్థికంగా ఆదుకున్నారు. ఇంతకన్నా మేలు చేసే ప్రభుత్వం ఉంటుందని నేను భావించడం లేదు.

– రౌతు జ్యోతి, తులసిదేవి పొదుపు సంఘం, బొడ్డవలస, డెంకాడ

సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- వాసవీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

విజయనగరం: సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వాసవీ క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని హోటల్ ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. వాసవి క్లబ్ సేవా సంస్థగా మంచి పేరు ప్రఖ్యాతలను పొందిందన్నారు. ఈ క్లబ్ ద్వారా ఆర్యవైశ్యులకు అలాగే సమాజ హితానికి అనేక ప్రయోజనకర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పూర్వం నుంచి సమాజ సేవతో పాటు వితరణ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్న ఆర్యవైశ్యులు అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రవికుమార్, జిల్లా గవర్నర్ ఎ.సాంబమూర్తి, పూర్వ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వాసవి క్లబ్ అధ్యక్షుడు చెన్న బుచ్చిజనార్ధన్ రావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విన్నకోట రమేష్, విజయ్‌కుమార్, అలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీరామ శోభాయాత్ర


సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీరామ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- అమ్మవారి ఆలయం నుంచి భారీ ఊరేగింపు, ర్యాలీ
- అలరించిన చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు

విజయనగరం టౌన్: శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీరామ శోభాయాత్ర ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. వందలాది మంది భక్తుల నడుమ యాత్ర మూడు లాంతర్లు, కోట జంక్షన్, సింహాచలం మేడ, స్టేడియం, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, రింగురోడ్డు మీదుగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా చిన్నారుల విచిత్ర వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. హనుమాన్, లక్ష్మణ, సీతా సమేత శ్రీరాముని విగ్రహాలను, శ్రీమద్రామాయణ పుస్తకాలను పండితులు వేదమంత్రాలతో , శ్రీరామ నామ సంకీర్తనలతో పూజాధికాలు చేశారు. కోలాటం, చెక్క భజనలతో అశేష భక్తబృందాలు ర్యాలీలో పాల్గొన్నాయి. శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు పిళ్లా విజయకుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు, భోగరాజు సూర్యలక్ష్మి, శైలజ, అర్చకులు పీసపాటి సంపత్‌కుమార్, శ్రీమన్నారాయణ ఆచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక వికాసం


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు


రెడ్డికంచేరులో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్ రమణ, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్: విద్యతోనే సామాజిక వికాసం సాధ్యమని, దీన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గుంకలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. నాడు– నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, కంటి వెలుగు పథకాలు అమలు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేసి ఉన్నత చదువుల లక్ష్యాన్ని నెరవేర్చుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, సర్పంచ్ కునుకు వెంకటరావు, ఎంఈఓ పీబీఎస్ రామచంద్రరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని సర్పంచ్ బైరెడ్డి రమణ అన్నారు. మండలంలోని రెడ్డికంచేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 47 మంది విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను సర్పంచ్ బైరెడ్డి రమణ విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శీరపు నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శీరపు వంశీరెడ్డి, పద్మ, బొల్లింకల చిన్నయ్యరెడ్డి, శీరపు నరసింగరావు(సర్దార్), ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న ప్రజ్ఞా వికాసం పరీక్ష

విజయనగరం ఫూల్‌బాగ్: పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్.వెంకటేష్ తెలిపారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో పరీక్షకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 1లోగా రూ.25 ఫీజు చెల్లించి, పేర్లు నమోదు చేసుకొని, హాల్‌టిక్కెట్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి అన్నారు. స్థానిక సబ్ జైలులో ఖైదీలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్ఐవీ వచ్చిన తర్వాత బాధపడే కంటే ముందే జాగ్రత్త వహించాలని సూచించారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఏఆర్‌టీ మందులు వాడి, మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సాధారణ వ్యక్తులు మాదిరి జీవించవచ్చునన్నారు. ఆ తర్వాత హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ ప్రచార ఫోమ్ బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ బి.సంపత్‌కుమార్‌రెడ్డి, డీపీఎం బాలాజీ , సాక్షి గోపాల్‌రావు, రాజేష్, ఎస్.త్రినాథ్, ఎల్.నాగరాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


విజయనగరం రూరల్: మందులను పరిశీలిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సందర్శించారు. రోగుల వివరాలు, వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఆయనకు అండగా నిలబడాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, సర్పంచ్ కునుకు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపేట పరిధిలో...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చంద్రంపేట గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. చంద్రంపేటతో పాటు టెక్కలి, ఎల్ఎస్ పురం గ్రామాల నుంచి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 186 మంది రోగులు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కళ్ల సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు ఎంపీడీఓ గిడుతూరి రామారావు, నాయకులు కర్రోతు రాజినాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తారామండల్ టెక్నాలజీస్‌తో 'సీతం' ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఉపగ్రహాల తయారీ వ్యవస్థకు చెందిన తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని సీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు ఎ.వినీల్‌జడ్సన్ ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూబ్ శాట్‌ల రూపకల్పన, అభివృద్ధికి సీతం విద్యార్థులు, ఫ్యాకల్టీకి ఇది దోహదపడుతుందన్నారు. ఉపగ్రహాలు, కక్ష్య వాహనాల ఉప వ్యవస్థలకు సంబంధించిన భాగాల రూపకల్పన, విశ్లేషణ, అనుకరణలు, ధ్రువీకరణలు, అభివృద్ధి కోసం సహకరించడం, పని చేసే నిబంధనలు, షరతులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ ఒప్పందం వల్ల కళాశాలలోని 1,500 మంది విద్యార్థులు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో స్వావలంబనను ప్రతి ఏడాదీ పెంపొందించుకొనేందుకు వీలు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ట్రిబుల్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.మల్లికార్జునరావు, సీతం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీవీఏ నాయుడు, డీన్ డాక్టర్ వై.నరేంద్ర, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


పంచాయతీ కార్యదర్శులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు పెంచారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగిస్తుందన్నారు. ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించడానికి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. జిల్లాకు ఎంతో మేలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డ డి.తిరుపతినాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


పంపిణీకి సిద్ధంగా వున్న ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీకి సిద్ధం

పూసపాటిరేగ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీకి సిద్ధంగా వున్నట్టు ఎంపీడీఓ ఎం.రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 16,186 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చినట్టు తెలిపారు. వలంటీర్లు, హెల్త్ సిబ్బంది ద్వారా కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 3257 వ్యాధులకు శస్త్రచికిత్సలు ఈ కార్డుల ద్వారా ఉచితంగా చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఆర్‌వి.రమణ, తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

విజయనగరం క్రైమ్: పేకాట ఆడుతున్న 16 మందిని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పరిధిలో ఉన్న ఉల్లివీధి, కాశీఘాట్ కాలనీలలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2 లక్షల 8వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఒకరి అరెస్టు


దాడుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్

నెల్లిమర్ల: డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వెంకటరావు ఆదేశాల మేరకు గుర్ల మండలం కెల్ల గ్రామంలో అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి నుంచి 100 మద్యం బాటి ల్స్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.తేజోవెంకటకుమార్ తెలిపారు. ఈ దా డుల్లో ఏఈఎస్ డి.శైలజారాణి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.